ప్రజాశక్తి
గురువారం 3 అక్టోబర్ 2024
5
అనంతపురం

ర్యాలీలో పాల్గొన్న మహిళా ఐక్యవేదిక నాయకులు

మద్యాన్ని నియంత్రించాలి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకురాలు సావిత్రి డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ 155 వ జయంతి సందర్భంగా మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అక్టోబర్ నుండి నూతన, మద్యం పాలసీని అమలు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో ప్రభుత్వం ఆమోదించిన షాపులు 2900 ఉండగా ఇప్పుడు ఏకంగా 3,396 షాపులను పెంచారన్నారు. జిల్లాలో 136 షాపులకు గెజిటెడ్ నోటిఫికేషన్ జారీ చేశారని చెప్పారు. గతంలో రాత్రి 8 గంటలకే షాపులు మూసివేస్తే ఇప్పుడు ఏకంగా రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచాలని నిర్ణయించడం సిగ్గుచేటని అన్నారు. మహిళల మాన, ప్రాణాల కంటే మద్యం ఆదాయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. మద్యాన్ని నియంత్రించడం, నేరాలను అరికట్టడం లాంటి వాటికి ప్రభుత్వం తిలోదకాలు ఇస్తున్నట్లు కనపడుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పద్మ, పార్వతి, సరస్వతి, అనిత, చంద్రిక, రామాంజనమ్మ, శంషాద్, నారాయణమ్మ, అరుణ, లక్ష్మి, అవాజ్ నాయకులు వలి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకి పందెం రాయుళ్లు..!

- జెసి, పెద్దారెడ్డి మధ్య పోటాపోటీ
- తాడిపత్రిలో మళ్లీ ఉత్కంఠ
- పట్టణవాసుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దసరా పండుగకు తాడిపత్రిలో పందెంరాయుళ్లు దిగేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు జెసి.ప్రభాకర్‌రెడ్డి గురువారం తాడిపత్రికి వస్తుండగా, తననూ పండుగకు తాడిపత్రిలోకి అనుమతించాలని వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా ప్రయత్నిస్తున్నారు. దీంతో మళ్లీ ఏమి జరుగుతుందోనన్న గుబులు తాడిపత్రి ప్రజల్లో నెలకొంది. ఈ ఇద్దరి మధ్య వైరం ఈనాటిది కాదు. అనేక ఏళ్లుగా నడుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. గడిచిన ఐదేళ్లు టిడిపి మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డిపై అనేక రకాలైన కేసులు నమోదు చేయడం జైలుకు పంపడం జరిగింది. అంతేకాకుండా పెద్దారెడ్డి ఏకంగా ఆయన నివాసంలోకెళ్లి రావడం కూడా అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో రెండు వైపులా పరస్పర దాడులతో తాడిపత్రి పట్టణం రణరంగాన్నే తలపించింది. బాంబుల దాడులు కాకుండా వినూత్నంగా తారాజువ్వలను ఒకరిపై ఒకరు వదులుకుని దాడులు చేసుకున్నారు. ఈ దాడులను అరికట్టలేకపోయారని జిల్లా ఎస్పీతోపాటు, డీఎస్పీ, సిఐ, ఎస్‌ఐలపై ఎన్నికల సంఘం వేటు వేసింది. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం కూడా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి పట్టణంలోకి రానివ్వకుండా నిలువరించేందుకు అధికార టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఆయన తాడిపత్రి పట్టణంలోకి వచ్చారని తెలుస్తూనే దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి బయటే ఉంటున్నారు. ఇక జెసి.ప్రభాకర్‌రెడ్డి కూడా అనారోగ్య కారణాలతో గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ చికిత్సపొందుతూ వచ్చారు. ఇద్దరు తాడిపత్రి పట్టణంలో లేకపోవడంతో ప్రశాంత వాతావరణే ఉంటూ వచ్చింది. ఇప్పుడు ఆరోగ్య మెరుగుపడటంతో జెసి.ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి గురువారం రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అనుయాయులు, మద్దతుదారులు పెద్దఎత్తున స్వాగత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇక ఇదే సమయంలో దసరా పండుగకు తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి కూడా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ జగదీశ్‌ను కలిసి విజ్ఞప్తి చేసి ఉన్నారు. ఆయన కూడా ఏదో రకంగా పండుగకు తాడిపత్రికెళ్లే ఆలోచనలోనున్నట్లు తెలుస్తోంది. దసరా పండుగ పేరుతో ఇద్దరూ ఒకేసారి విచ్చేస్తే ఏమవుతుందోనన్న ఉత్కంఠత తాడిపత్రి పట్టణ ప్రజల్లో నెలకొంది. ఇద్దరు కూడా దసరా పందెంరాయుళ్లలాగా పోటీ పడుతుండటంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకునే ప్రమాదం కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఇద్దరి మధ్య వివాదం చెలరేగకుండా ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సుంది. జెసి.ప్రభాకర్‌రెడ్డి మాత్రం పెద్దారెడ్డి బహిష్కరించాలని ఇది వరకే డిమాండ్ చేశారు. ఆయన అనుయాయుడు రవీంద్రారెడ్డిని ఏ రకంగా బహిష్కరించారో ఇప్పుడు వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపైనా చర్యలు తీసుకోవాలని కోరుతుండటం గమనార్హం. అయితే పోలీసులు ఈ సమస్యను ఏ రకంగా అధిగమిస్తారన్నది చూడాల్సుంది.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా సర్దుబాటు ఛార్జీలను పెంచాలని నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం జిలా కార్యదర్శి వి. రాంభూపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) 2022- 23 సంవత్సరానికి సుమారు 8114 కోట్ల రూపాయల భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తక్షణం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించి మరో 11 వేల కోట్ల రూపాయలకు పైగా సర్దుబాటు ఛార్జీల భారం మోపబోతున్నారని వార్తలు వస్తున్నాయన్నారు. దీని ద్వారా మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయల భారం విద్యుత్ వినియోగదారులు, రాష్ట్ర ప్రజలపై పడబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యుత్ కంపెనీల దోపిడీ, అధిక రేట్లకు పవర్ ఎక్స్ఛేంజ్‌లో స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు, వివిధ స్థాయిల్లో అవినీతి, అపసవ్య విధానాల వల్ల విద్యుత్ వ్యయం పెరుగుతోందన్నారు. ఆ భారాన్ని సర్దుబాటు చార్జీల రూపంలో జనం నెత్తిన వేయటం భావ్యం కాదన్నారు. ఇప్పటికే వివిధ రకాల పేర్లతో వేస్తున్న విద్యుత్ ఛార్జీలు చార్జీలు అధిక భారంగా ప్రజల భావిస్తున్నారన్నారు. వారికి ఉపశమనం కలిగించకుండా ఇలాంటి అదనపు భారాలు మోపటం సరికాదని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఈ నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలన్నారు. ఏనాడో వాడుకున్న విద్యుత్తుకు ఆ తర్వాత కాలంలో అదనంగా వేసే సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు అక్రమంగా బిగించిన స్మార్ట్‌మీటర్లు తొలగిస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో వాగ్దానం చేశారని ఆ మేరకు వాటిని తొలగించాలని రాంభూపాల్ డిమాండ్ చేశారు.

మహాత్మా.. నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించు..

యుటిఎఫ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'మహాత్మా.. నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా చూడు' అంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)' నాయకులు వేడుకున్నారు. మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా యుటిఎఫ్ జిల్లావ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా అనంతపురంలోని క్లాక్‌టవర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు వి.గోవిందరాజులు మాట్లాడుతూ మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు, పీఎఫ్ సౌకర్యం, భాషా పండితులు మరియు పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్ చేస్తూ, ప్రమోషన్లు ఇవ్వాలని, అర్బన్ ఎంఇఒ పోస్టులను ఇవ్వాలని, ఉన్నత పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ కమిటీ మెంబర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగేంద్ర, మండల బాధ్యులు శ్రీనివాసులు, శివశంకర్, చంద్ర, రాజేంద్ర, శివరుద్రప్ప, ఓబుళపతి, హెన్రీ, విక్టర్, బాషా, నారాయణస్వామి, చంద్రశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయులు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక మహాత్మా గాంధీ కూడలిలో ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవ, నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, రాజకుమార్, మల్లికార్జున, శంకరయ్య, సిద్ధయ్య, విశ్వేశ్వరబాబు, సుధాకర్, రఫీ, తమ్మారెడ్డి రమేష్, వెంకటేష్, చలపతి, గురునాథ్, కస్తూరి మండల నాయకులు శంకర్‌నాయక్, సురేఖ, వజ్రకరూరు మండల శాఖ అధ్యక్షుడు జి.పవన్, నాయకులు మురళి, చంద్రమౌళి, రాంబాబు, రామచంద్రనాయక్, ఆంజనేయులు, బాషా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

గుంతకల్లులో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ఈ-పంట నమోదును పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె: మండలంలో ఈ-పంట నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రగుంట్ల, కమలాపురం, కొప్పలకొండ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్‌తో కలిసి ఈ-పంట-2024 నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపంట నమోదుతోపాటు ఇకెవైసి చేయించుకునేందుకు నేటితో గడువు ముగుస్తుందన్నారు. ఇప్పటివరకు మండలంలో 9427 మందికి 9078 మంది రైతులు ఇకెవైసి చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు కూడా తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌ఎ శిరీషా, ఆమని, మల్లికార్జున పాల్గొన్నారు.

ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ముగిసిన 'స్వచ్ఛత హి సేవ'

జెడ్పీ పరిసరాలను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సిబ్బంది

అనంతపురం రూరల్ : నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బందితో కలిసి కార్యాలయ ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో గొప్ప చరిత్ర కలిగిన దేశం భారత దేశం అన్నారు. అలాంటి గొప్ప దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి మహాత్మా గాంధీ అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి సి.ఓబుజలమ్మ, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి లలితాబాయి, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం : కలెక్టర్

ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీలు, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పనిచేద్దామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్‌లో కక్కలపల్లి కాలనీలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో రెండు వారాల నుంచి అందరూ చిత్తశుద్ధితో పాల్గొనడంతో జిల్లాకు 'స్వచ్ఛత మే జన్ భాగీధారి'లో మొట్టమొదటి స్థానం రావడం గర్వకారణం అన్నారు. జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థలకు అందరికీ ఈ అవార్డుని అంకితం చేస్తున్నామన్నారు. మహాత్మా గాంధీ జయంతి రోజున స్వచ్ఛతా హి సేవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. అనంతపురం ఎంపీ అంబికా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలు ప్రతినిత్యం పాటిస్తూ మన ప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ "స్వచ్ఛత మే జన్ భాగీధారి " అంశంలో అనంతపురం జిల్లా మొదటి బహుమతిని కైవశం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ స్వరాజ్యం సాధించడమే లక్ష్యంగా పెట్టుకుందామన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్యసాయి తాగునీరు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్ర (పారిశుధ్య కార్మికులను) లను జిల్లా కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం కుందుర్పి కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వేస్టేజ్ తో బొమ్మల తయారీ స్టాల్ ను పరిశీలించి పిల్లలను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

ప్రజాశక్తి పెద్దవడుగూరు

వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో రైతులు సాగుచేసిన పలు పంటలు నిట్టనిలువునా ఎండుతున్నాయి. ఎంతో ఆశలతో సాగుచేసిన వేరుశనగ, పత్తి, కొర్రపంటలు వర్షాలు లేక ఎండిపోతున్నాయి. మండలంలోని కొండూరు, వీరన్నపల్లి, నాగలాపురం, కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వరుణుడి కోసం రోజు అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. సాగు చేసిన పంటలు వాడుదశకు చేరి పొలంలోనే నిట్టనిలువునా ఎండుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడ్డామని వర్షాలు పడకపోవడం వల్ల పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని కొండూరుకు చెందిన రైతులు రమణారెడ్డి, సురేంద్రనాథరెడ్డి, చింతలరేవతి, లీలావతి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వేరుశనగ పంట చేతికొచ్చే సమయానికి పంటను నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

సాగునీటిని విడుదల చేయాలి

మండలానికి ఉత్తర కాలువ హెచ్చెల్సీ నుంచి సాగునీటిని అందించి ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అధికారులు, పాలకులు రైతులకు సహరించాలని మండల రైతులు కోరుతున్నారు. సాగునీటి ద్వారా కొంతవరకైనా పంటలను కాపాడుకోవచ్చునని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎండిన వేరుశనగ పొలాన్ని చూపుతున్న బాధిత రైతు

ఎండిన పత్తిపంట పొలాన్ని చూపుతున్న బాధిత రైతు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో సిఐలు, ఎస్‌ఐలు పాల్గొని గ్రామస్తులతో సమావేశమై ముఖాముఖిగా మాట్లాడారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం చేయద్దని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని కేసుల వరకు వెళ్లొద్దని సూచించారు. కేసుల్లో ఇరుక్కుపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఆ ప్రభావం కుటుంబ సభ్యులపై ప్రభావం చూపుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ముఖ్యంగా మట్కా, పేకాట, అక్రమ మద్యం, క్రికెట్ బెట్టింగు, ఇసుక అక్రమ రవాణా, గంజాయిలకు దూరంగా ఉండాలన్నారు.

పల్లె నిద్రలో పాల్గొన్న పోలీసులు

సంపూర్ణ పౌష్టికాహారమే ఐసిడిఎస్ లక్ష్యం

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మాతాశిశు, మరణాలను తగ్గించడంతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలకు సంపూర్ణ పౌష్టికాహారం అందించడమే ఐసిడిఎస్ లక్ష్యమని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం ఐసిడిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ 1975 అక్టోబర్ 2న సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) ప్రారంభమైందన్నారు. ఆవిర్భావం నుంచి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ ద్వారా అంగన్వాడీలను ఏర్పాటు చేసి పౌష్టికాహారం అందించడంతోపాటు మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు ఇంగ్లీష్ బోధన చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, పిల్లలు అందరికీ పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. ఇకపోతే మండల వ్యాప్తంగా 11 సచివాలయాలు, 16 పంచాయితీలు, 34 గ్రామాల పరిధిలో రెండు ఐసిడిఎస్ సెక్టార్లు ఉన్నాయన్నారు. ఇందులో వేపులపర్తి, బ్రహ్మసముద్రం మండలవ్యాప్తంగా 47 మెయిన్, 11 మినీ సెంటర్లు కలిసి 58 సెంటర్లు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 58 మంది అంగన్వాడీలు పని చేస్తున్నారన్నారు. వీరిని పర్యవేక్షించేందుకు సూపర్వైజర్ రామాంజినమ్మ, కాసింబి లను ఐసిడిఎస్ శాఖ కేటాయించిందన్నారు. ఇవేకాక జనన, మరణాలు, ఇమ్యునైజేషన్, పౌష్టికాహారం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంతోపాటు ఆయుష్షును పెంచడం ఐసిడిఎస్ పూర్తి బాధ్యతలు తీసుకొందన్నారు.

పామిడి : స్థానిక దుర్గమ్మ వీధిలో ఉన్న అంగన్వాడీ సెంటర్-2లో అంగన్వాడీ టీచర్ జెఎల్.నారాయణమ్మ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందరంగా ఎసిడిపిఒ నాగమణి మాట్లాడుతూ 1975 అక్టోబర్ 2వతేదీన ఐసిడిఎస్‌ను స్థాపించారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఐసిడిఎస్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మాతాశిశు మరణాల రేటు తగ్గించడం, పిల్లలు, తల్లుల్లో రక్తహీనతను నివారించడం, పిల్లలకు సమయపాలనలో ఆహారం ఇవ్వడం, తల్లీబిడ్డలను సంరక్షించడం, ఆరేళ్లలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడం వంటివి ఎన్నో చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రెహనా, శోభారాణి, తల్లులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాఠాలు చెబుతున్న బ్రహ్మసముద్రం ఐడిసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న

'మహాత్మా.. మద్యాన్ని నియంత్రించు..'

ఐద్వా ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

'మహాత్మా.. నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించి మద్యాన్ని నియంత్రించేలా చూడు' అంటూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు వేడుకున్నారు. మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు.

ఇందులో భాగంగా మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కళాణదుర్గం గాంధీచౌక్‌లో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా డివిజినల్ కార్యదర్శి లత, సిఐటియు జిల్లా సభ్యులు అచ్యుత్ మాట్లాడుతూ మద్యాన్ని నియంత్రించి మహాత్మా గాంధీ కలల సహకారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. హత్యలు, హత్యాచారాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానం నిషేధిస్తామన్న నేతలే మద్యాన్ని ఏరులై పారిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలతోనే రాష్ట్రానికి ఆదాయ వనరులుగా భావించిన నేతలు సామాన్యుల కుటుంబాలను భక్షిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే ప్రభుత్వం మద్యాన్ని నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగనవాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పాతక్క, అంగనవాడీలు లక్ష్మీ, తులసి, పద్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో గాంధీజీ విగ్రహానికి వినపతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

గుత్తి : రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా గాంధీజీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఐద్వా నాయకురాలు రేవతి, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, నాయకులు సూరి, నరసింహ, వెంకటలక్ష్మి, శ్యామల, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ జయంతి సందర్భంగా ఐద్వా మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సి.రమేష్, నాయకులు వెంకీ, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం పాలసీని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మద్యాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం నాయకురాలు లక్ష్మీబాయి, లక్ష్మీ, డివైఎఫ్ఐ నాయకులు చొక్కా సునీల్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు గుర్తించేందుకే గ్రామసభలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో 2025-26 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం సంబంధించి పనులు గుర్తించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు కలిసి పనులను గుర్తించారు.

పుట్లూరు గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

పెద్దవడుగూరు : ఉపాధి హామీ పథకం కింద పంచాయతీలో చేయాల్సిన పనులపై కూలీలు, ప్రజలు దృష్టి సారించాలని ఎంపిడిఒ కుళ్లాయిస్వామి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వరలక్ష్మీ అధ్యక్షతన ఉపాధి పనుల ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించిన పనుల గుర్తింపు, ప్రణాళిక ప్రక్రియపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం సహాయాధికారి పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, వైద్యుడు శ్రీనివాసబాబు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలో 2025-26 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం సంబంధించి పనులు గుర్తించేందు బుధవారం మండల వ్యాప్తంగా ఎపిడి వెంకటరత్నం, ఎపిఒ షబ్బీర్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ముందుగా గాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

పుట్టుకతోనే బిడ్డకు శ్వాస సంబంధిత వ్యాధి

కిమ్స్ సవీరా ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

ఆ బాబుకు తండ్రి పూర్తిగా అంధుడు. తల్లికి కూడా దాదాపు 50 శాతానికి పైగా అంధత్వం ఉంది. దాంతో, బాబు పుట్టినప్పటి నుంచే తీవ్రంగా ఆయాసం ఉండడాన్ని పాపం ఆ తల్లిదండ్రులు ఇద్దరూ గుర్తించలేకపోయారు. పుట్టిన మూడున్నర నెలల తర్వాత ఇక పాలు కూడా తాగలేని పరిస్థితి రావడం, ఆయాసం శబ్ధాలు వినిపించడంతో అప్పుడు బంధువుల సాయంతో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి తీసుకురాగా విజయవంతంగా శస్త్రచికిత్స చేసి సమస్యలను పరిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ ఎ.మహేష్ వివరించారు.

ఆ బాబుకు పుట్టుకతోనే అత్యంత తీవ్రమైన సమస్య ఉంది. పొట్టలో ఉండాల్సిన కొన్ని ముఖ్యమైన అవయవాలు ఊపిరితిత్తుల స్థానంలో ఏర్పడ్డాయి. వాటిలో కాలేయంలో కొంత భాగం, ప్లీహం (స్ప్లీన్), కొంతమేర పేగులు కూడా ఉన్నాయి. దాంతో ఊపిరితిత్తులకు తగినంత స్థలం దొరక్క అవి బాగా కుచించుకుపోయాయి. ఫలితంగా బాబు పెరగాల్సినంత బరువు కూడా పెరగలేదు. పుట్టినప్పుడు 3.8 కిలోల బరువు ఉండగా, తర్వాత మూడు నెలల్లో కనీసం రెండు కిలోలు పెరగాలి. కానీ, తీసుకొచ్చేసరికి కేవలం 4.7 కిలోలు మాత్రమే ఉన్నాడు. ముందుగా ఎక్స్ రే చేసి చూస్తే ఊపిరితిత్తుల వద్ద అంతా తెల్లగా ఉంది. దాంతో సీటీ స్కాన్ లాంటి ఇతర పరీక్షలు కూడా చేసి చూసినప్పుడు అసలు సమస్య తెలిసింది. నిజానికి ఇవన్నీ పుట్టక ముందునుంచే ఉంటాయి. బాబు పుట్టిన వెంటనే కూడా విపరీతమైన ఆయాసం ఉంటుంది. అయితే దురదష్టవశాత్తు తల్లిదండ్రులు ఇద్దరూ అంధులు కావడంతో వారు బాబు ఆయాసపడడాన్ని గుర్తించలేకపోయారు. బంధువుల్లో కూడా అప్పుడప్పుడు వచ్చివెళ్లేవారు కావడంతో వారూ సరిగా తెలుసుకోలేదు. చివరకు ఎవరో ఒక్క బంధువు మాత్రం అప్పుడప్పుడు ఆయాసం వచ్చేదని చెప్పారు. బాబు ఇక్కడకు రాగానే వెంటనే వెంటిలేటర్ మీద పెట్టి, అనంతరం కావల్సిన వైద్య పరీక్షలన్నీ చేసి వైద్యులు మనోహర్‌గాంధీ, గిరధర్ సాయంతో శస్త్రచికిత్స చేసి అవయవాలన్నింటినీ అవి ఉండాల్సిన స్థానంలో పెట్టి మళ్లీ మూసేసినట్లు వివరించారు. అయితే బాబును దాదాపు మరో రెండు, మూడేళ్ల పాటు జాగ్రత్తగా పరిశీలించుకుంటూ ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు తగిన టీకాలు ఇప్పించడం, వైద్యులకు చూపించడం ద్వారా.. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవచ్చన్నారు.

సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందిన చిన్నారితో తల్లిదండ్రులు

'స్వచ్ఛత హి సేవ' అధికారులకు ప్రశంసాపత్రాలు

పుట్లూరు : స్వచ్ఛత హి సేవ కార్యక్రమాను విజయవంతంగా నిర్వహించినందుకు పలువురు అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ యోగానందరెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో ప్రశంసాపత్రం అందకున్నారు. దీంతో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపిడిఒకు అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న పుట్లూరు ఎంపిడిఒ యోగానందరెడ్డి

పామిడి : స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు పామిడి ఐఒఆర్‌డి శశికళ, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ జిల్లాకేంద్రంలో ప్రశంసాపత్రం అందకున్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న పామిడి అధికారులు

కుందుర్పి : స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించినందుకు ఎంపిడిఒ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బికె పార్థసారథి, జెడ్పీ సిఇఒ ఓబుళమ్మ, తదితరులు వీరికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి అధికారి ఉత్తమ పనితీరు కనబరిస్తే ప్రశంసలు అవంతట అవే వస్తాయన్నారు. ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నందుకు మండల వాసులు, అధికారులు అభినందించారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న కుందుర్పి ఎంపిడిఒ లక్ష్మీనరసింహ

శింగనమల : స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఎంపిడిఒ నిర్మలకుమారి ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, తదితరుల నుంచి ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న శింగనమల ఎంపిడిఒ నిర్మలకుమారి

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ 'పోతుల'కు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర పద్మశాలి సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎన్నికైన పోతుల లక్ష్మీనరసింహులును పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని కమలానగర్‌లో ఉన్న పద్మశాలి సంఘం జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేవా జిల్లా అధ్యక్షులు కొంతం సివరుద్ర, ప్రధాన కార్యదర్శి తాడురు చంద్రశేఖర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ముగ్గురు చేనేత కులాలను ఆదరించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా తొలివిడత నామినేటెడ్ పదవుల్లో జిల్లాకే చెందిన పోతుల లక్ష్మీనరసింహులుకు అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా సూర్యనారాయణ, ఉద్యోగులు గంజి రాము, శీల వెంకటస్వామి, బసపతి సురేష్, గుర్రం యుగంధర్, జింకా మహేష్, వాసవి రామకృష్ణ, గోరంట్ల శ్రీనివాసులు, దేవరకొండ నరసింహులు, రఘు, రాము, తదితరులు పాల్గొన్నారు.

పోతుల లక్ష్మీనరసింహులును సన్మానిస్తున్న పద్మశాలి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

'జాతిపిత' అడుగు జాడల్లో నడవాలి

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

జాతిపిత మహాత్మా గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దామని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో ఉన్న పరిపాలన భవనంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలకులపై అహింసాయుతంగా పోరాడి స్వాతంత్ర్యం సాధించడానికి దేశ ప్రజలను ఒక్కతాటిపై నడిపించిన మహానుభావుడు గాంధీజీ అన్నారు. గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి ఆశయాలను ఈతరం వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒటిపిఆర్ఐ అనుబంధ కళాశాలల్లో డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, సిబ్బంది ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు ఎస్‌వి.సత్యనారాయణ, పిఆర్.భానుమూర్తి, జి.ప్రశాంతి, పి.సుజాత, బి.దుర్గాప్రసాద్, వైశాలి ఘోర్పడే, ఆర్.కిరణ్మయి, నాగప్రసాద్ నాయుడు, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎ.సురేష్‌బాబు, ఎపి.శివకుమార్, శ్రీధర్, మాధవి, పిఆర్ఒ బి.ఓంప్రకాష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, సి.శశిధర్, జి.మమత, విష్ణువర్ధన్, డిప్యుటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, తదితరులుపాల్గొన్నారు.

జెఎన్‌టియులో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రిచిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

అనంతపురం కలెక్టరేట్ : జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు సాకె భాస్కర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న స్వరాజ్య సాధన కోసం ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహాత్ముడి ఆశయాలైన సంపూర్ణ మద్యపాన నిషేధం, నిరక్ష్యరాస్యత నిర్మూలన, స్వరాజ్య సాధన వంటి వాటినే జెవివి తన ఆశయాలుగా తీసుకుని అనేక ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రజల్లో నిరక్షరాస్యత, మూఢాచారాలు నిర్మూలిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌రెడ్డి, వీరరాజు, నగర నాయకులు లక్ష్మీనారాయణ, ప్రసాద్‌రెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, నాయకులు గంగారామ్, విశాలాక్షి, కూచి హరి, సరిపూటి రమణ, సాకే లక్ష్మీనరసింహ, కుంచపు వెంకటేష్, సుధాకర్‌యాదవ్, నెట్టెం బాలకృష్ణ, నారాయణస్వామి యాదవ్, మణికంఠ బాబు, వెంకటేశ్వరరెడ్డి, కురుబ నారాయణస్వామి, డిష్ ప్రకాష్, నాగభూషణ, వెంకటరాముడు, రమేష్ బాబు, హేమంత్, గురు, భవాని, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 'పద్మవాణి' విద్యార్థులు

తాడిపత్రి : పట్టణంలోని పద్మవాణి హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి అథెంటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ నాగవీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానం కైవసం చేసుకున్న పద్మవాణి హైస్కూల్ విద్యార్థిని గగన క్రీడా విభాగంలోనూ జిల్లాస్థాయిలో ఎంపిక కావడం సంతోషకరమన్నారు. అలాగే నియోజకవర్గస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్-14 కేటగిరీలో 400 మీటర్లు, హైజంప్‌లో మోహిత్, రిజ్వాన్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఆయా విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు పిఇటి హాజీవలి అభినందించారు.

క్రీడాకారులతో కరస్పాండెంట్ నాగ వీరయ్య

క్రీడల్లో 'అనంతలక్ష్మి' విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : పట్టణంలో స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన మోడరన్ పెంటలోన్ అండర్-17లో బాలికల విభాగంలో పి.శ్రీయశశ్విని, సి.సృజన, శిరీషా, బాలుర విభాగంలో ఈతన్, ప్రణయ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. అండర్-19 బాలికల విభాగంలో కీర్తన, రెడ్డి జ్యోష్న, రిషిత విజయం సాధించారు. వీరందరూ శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ అనంత రాముడు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అనంత రాముడు

రాష్ట్రస్థాయి పోటీలకు గుండిగానిపల్లి విద్యార్థి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుండిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వడ్డే చందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు పద్మిని, ప్రధానోపాధ్యాయురాలు లిల్లీ సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలీబాల్ అండర్-14 విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లక్ష్మీపతి, స్వప్న, అండర్-17 విభాగంలో శిరీషా, వడ్డే చందు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అలాగే జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు అండర్-14 విభాగంలో రాజేంద్ర, లక్ష్మీపతి, పవన్, అండర్-17 విభాగంలో చందు, నితిన్, వెంకటేష్ పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో పోలేపల్లి గ్రామానికి చెందిన వడ్డే చందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వడ్డే చందును హెచ్ఎం, ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు.

మద్యం విక్రేతల అరెస్టు

పెద్దపప్పూరు : మండలం పరిధిలో రామకోటి కాలనీలో కర్ణాటక మద్యం అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి చింతా కేశవనారాయణ, చింతా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని 20 టెట్రా ప్యాకెట్లు, మూడు ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇకెవైసికి సభ్యులు సహకరించాలి

కో-ఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి మారుతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

భైరవానితిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు వ్యక్తిగత వివరాలను అందించి ఇకెవైసికి సహకరించాలని కో ఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి మారుతి కోరారు. బుధవారం స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం సభ్యులు ఇకెవైసికి సహకరిస్తే త్వరితగతిన ఆన్‌లైన్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. మండల వ్యాప్తంగా నాలుగు గ్రామాల పరిధిలో 6,463 మంది సభ్యులకు ఇప్పటి వరకూ కేవలం 1800 మంది రైతులు మాత్రమే తమ వ్యక్తిగత వివరాలతో ఇకెవైసి చేయించుకున్నారన్నారు. కావున మిగిలిన వారు ఆధార్, రేషన్, పట్టాదారు పాస్ పుస్తకం, వన్‌బి, అడంగల్, పాస్‌ఫోటోలను గ్రామ సచివాలయంగానీ, పిఎసిఎస్ కార్యాలయంలోగానీ అందజేసి ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సిబ్బంది ఈశ్వరాచారి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యులతో మాట్లాడుతున్న కో ఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి మారుతి

సబ్‌జైలు తనిఖీ

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని బుధవారం సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ్ తనిఖీ చేశారు. ముందుగా జైలు ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జైలులో ఉన్న వంటగది, స్టోర్ గది, ఖైదీల బారెక్‌లు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ప్రశాంత జీవితం కొనసాగించాలని కోరారు. తర్వాత ఖైదీలకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపకారాగార సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాదులు విసి.గంగాధర్‌కుమార్, షఫీవుల్లా, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథ్

పప్పుశనగ కోసం దరఖాస్తు చేసుకోండి

యాడికి : రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులు పప్పుశనగ విత్తనాల కోసం నేటి నుంచి ఆయా రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

'స్వచ్ఛభారత్'పై షార్ట్ ఫిలిం విడుదల

కళ్యాణదుర్గం : మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం స్ఫూర్తితో లక్ష్మంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నగేష్, వీరభద్ర ఆధ్వర్యంలో చిత్రీకరించిన స్వచ్ఛభారత్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిం బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నివాసం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి ధర్మతేజ, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, మండల విద్యాశాఖ అధికారి వి.శ్రీధర్, వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు, ఇన్ఫినిటీ ఫౌండేషన్ అధ్యక్షులు బద్దేనాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాకుండా సమాజ సంస్కరణ చైతన్య స్ఫూర్తి నింపడంలో కూడా భాగస్వాములు అవుతారని నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు బీసీ తిమ్మప్ప, బి.ఎర్రిస్వామి, ఈరన్న, తూమాటి శ్రీనివాసులు, కళాసమితి అధ్యక్షులు ఎర్రిస్వామి, ఫణిరాజు, షాషావలి, విష్ణు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిలింను విడుదల చేస్తున్న నాయకులు

మొక్క నాటుతున్న అతిథులు

మొక్కలు నాటి సంరక్షించాలి

గుత్తి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐఒడబ్ల్యూ నాయక్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని గుత్తి పోర్టు రైల్వేస్టేషన్ ఆవరణలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాకం శ్రీకాంత్ మాట్లాడుతూ గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్లో రైల్వే అధికారులు అనుమతి ఇస్తే గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారి మనోజ్, సిబ్బంది ప్రసాద్‌రెడ్డి, విజయనంద్, గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు ఎన్.సుధాకర్ నాయుడు, ఆటో యూనియన్ నాయకులు నాగార్జున, సురేష్, షేక్ నజీర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, అధికారులు

ముగిసిన 'స్వచ్ఛత హి సేవ'

ప్రజాశక్తి-నార్పల

స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచి సుప్రియ, ఉపసర్పంచి గవ్వల శ్రీరాములు, ఎంపిడిఒ దివాకర్, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, వార్డు సభ్యుడు కొత్తమిద్దె నాగభూషణ, పంచాయతీ సెక్రటరీలు చరణ్, పరశురాం, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : పురపాలక సంఘం కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ముగిసింది. ఇందులో భాగంగా స్థానిక గాంధీచౌక్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అక్కడి నుంచి ర్యాలీగా టీ సర్కిల్‌కు చేరుకుని రోడ్డు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, డిఇఇ సురేష్‌బాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అలీఖాన్, కార్మికులు పాల్గొన్నారు.

పుట్లూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

పుట్లూరు : స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్య, టైపిస్టు శశికుమార్‌రెడ్డి, చెర్లోపల్లి కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ఇఒఆర్‌డి శశికళ, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తడిచెత్త, పొడి చెత్త, బహిరంగ మలవిసర్జన, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాగా ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న ఇఒఆర్‌డి, పంచాయతీ సెక్రటరీ, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ లంగాల గౌస్‌పీరా, బహుజన నాయకుడు మనవల ఆంజనేయులు, అప్పన్నగారి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్వచ్ఛతహి సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఉరవకొండలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తర్వాత టవర్‌క్లాక్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, సర్పంచి లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

గాంధీజీ మార్గాన్ని అనుసరిద్దాం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

జాతిపిత మహాత్మా గాంధీజీ ప్రపంచానికి చూపిన సత్యం, అహింసా మార్గాల్లో నడుద్దామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి అహింసతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానుభావుడు గాంధీజీ అన్నారు. ఆయన నమ్మిన సత్యం, అహింసా సిద్ధాంతాలు, సహాయ నిరాకరణ, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకుని ముందుకు సాగారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కె.విజయ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, ఎసిపి హరిప్రసాద్, డిఇ ద్రాక్షాయణి, కార్పొరేటర్లు లాలూ, కమల్‌భూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. మహాత్మా గాంధీ గారి చిత్ర పటానికి పూలమాల వేసి పోలీసులు ఘనంగా నివాళులు అర్పించారు. భారత దేశ స్వాతంత్ర్య సముపార్జనలో బాపూజీ గారు అనుసరించిన అహింసావాదం యావత్తు ప్రపంచ దేశాలకే ఆదర్శనీయమని కొనియాడారు. మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నడిచి దేశ సమైక్యతకు పాటుపడదామని పిలుపునిచ్చారు.

అనంతపురం : నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న మాజీ సైనికుల కార్యాలయంలో కెప్టెన్ షేకన్న అధ్వర్యంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మాజీ సైనికులు పట్నం ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, తలమర్ల కృష్ణ, బషీర్‌అహ్మద్, గొల్ల ఈశ్వరయ్య, అమర్నాథ్‌లాల్, బిఎ.హుస్సేన్, పెంచలయ్య, బాలాస్వామి, సిద్ధన్న, రామాంజనేయులు, నరసింహులు, ఖాజామొయిద్దీన్, వహాబ్, అబ్దుల్‌రజాక్, హుస్సేన్‌బాషా, నోబుల్ ప్రభుదాస్, వై.ప్రసాద్, అబుసాలేహా, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, సూపరింటెండెంట్లు విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : శాంతియుత మార్గమే ఎప్పటికైనా ఆచరణీయమని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింసను ఆయుధాలుగా స్వాతంత్ర్యం కోసం గాంధీజీ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్, జై కిసాన్ నినాదంతో దేశాన్ని సంఘటితం చేశారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు హిందుత్వం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా వైసీపీ పాలనలో అడుగులు పడ్డాయన్నారు. 2019లో వైఎస్ జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజుల్లో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి సంక్షేమ పథకాలను గడపగడపకు చేరువ చేశామని గుర్తు చేశారు.

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి ఎస్సీ కాలనీలో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్ బి.సరస్వతి, పెద్దక్క, ధనలక్ష్మి, వర్షిత, నాగమ్మ, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల్లో వక్తలు

బొమ్మనహాల్ : మండల కేంద్రంతోపాటు ఉద్దేహాల్, శ్రీధర్‌ఘట్ట, గోవిందవాడ, కురువల్లి, వన్నూరు, బొల్లనగుడ్డం, నేమకల్లు గ్రామాల్లో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళర్పించారు.

నార్పల : మండల జనసేన ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, నాయకులు తుపాకుల భాస్కర్, పొన్న తోటరామయ్య, షేక్ రహంతుల్లా, వినోదం, లోకేష్, గిరీష్, సంగా అశోక్, సోమనాథ్, వెంకటేష్, శెట్టి రామకృష్ణ, ప్రదీప్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ బి.జబ్బర్‌మియా ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌ఎంపీ అతిథి గృహం నుంచి రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. తర్వాత మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన పారిశుద్ధ కార్మికులను సన్మానించారు. వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, ఎంపిడిఒ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి, పెన్షనర్ల భవనంలో సంఘం ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ఉరవకొండ : దళిత గిరిజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్, ప్రజాసంఘాల నాయకుడు పాల్తూరు ఆనంద్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్ ముద్దలాపురం పెద్దన్న, ఎంఆర్‌పిఎస్ నాయకులు కోనాపురం ఎర్రిస్వామి, ముష్టూరు ఎర్రిస్వామి, కొనకొండ్ల చిన్న ఆంజనేయ, డిజిహెచ్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి రాయంపల్లి సోమశేఖర్, కడమలకుంట సుంకన్న, కూడేరు ఎర్రిస్వామి, కరెంట్ గోపాల్ అమిద్యాల నారాయణస్వామి, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంతోపాటు కిష్టిపాడు తదితర గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఉషారాణి, పోలీసుస్టేషన్, పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, ఎపిఒ పుల్లారెడ్డి తదితరులు గాంధీజీకి నివాళులర్పించారు.

కళ్యాణదుర్గం : పట్టణంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాల ఎర్రిస్వామి, ఫక్రుద్దీన్, విశ్రాంత తహశీల్దార్ తిమ్మప్ప, మాజీ ఏబ్లాక్ అధ్యక్షుడు జియావుద్దీన్, పట్టణ అధ్యక్షుడు బోయ నాగరాజు, డిసిసి కార్యదర్శి, మైనార్టీ నాయకుడు కొలిమి దాదాపీర్, ఉద్దీప్ సింహా, కరెంట్ గోవింద్, ఈశ్వర్ ప్రసాద్, దాదాఖలందర్, సురేష్, బూదెప్ప, గణేష్, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ట్రైనీ కలెక్టర్, ఇన్‌ఛార్జి రెవెన్యూ డివిజనల్ అధికారిణి వినూత్న ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి ఈశ్వరమ్మ, డిప్యూటీ తహశీల్దార్ ఇ.వెంకటేష్, సీనియర్ సిటిజన్ మాల ఎర్రిస్వామి, విశ్రాంత తహశీల్దార్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

అలాగే కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయం విశ్వనాథ్, గోపీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

బెలుగుప్ప : మండల వ్యాప్తంగా గాంధీజీ జయంతిని వేడుకలను నిర్వహించారు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు, ప్రభుత్వం పాఠశాలల్లో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ రామచంద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్, ఎస్ఐ శివ, కస్తూరిబా పాఠశాల ఎస్ఒ నాగరత్న బాయి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వకృత్వపు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు సంధ్య, మమత, నాగవేణి, భారతి, సుకన్య, శిరీషా, మాలశ్రీ, తదితరులు పాల్గొన్నారు

స్థానిక శ్రీ శ్రీనివాస విద్యానికేతన్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వేముల శ్రీనివాసులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో సర్పంచి రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి ఉపాధి పనులపై ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, ఇంజనీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల వ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లక్ష్మీనారాయణ, జెడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాల, ఐకెపి, తహశీల్దార్ కార్యాలయాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, తెలుగు పండిట్ సాయి ప్రసాద్, పీడీ కేశవమూర్తి, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని హంపాపురం గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.హేమసాగర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రిన్సిపల్ టి.విష్ణువర్ధన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెన్నపూస శివారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్, మొదలగు అధ్యాపకులు పాల్గొన్నారు.

పామిడి : ఆర్యవైశ్య సంఘం, గ్రామ పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలోని గాంధీజీ జయంతిని నిర్వమించారు. ఇందులో భాగంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం నుంచి గాంధీ చిత్రపటాన్ని ఊరేగించారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో సంఘం అధ్యక్షులు ఇల్లూరు ఉపేంద్ర ఆధ్వర్యంలో విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కె.నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న